క్లుప్తంగా

ఎల్లాపురం లైన్‌మెన్‌గా రవి

హసన్‌పర్తి: ఎల్లాపురం గ్రామ విద్యుత్ లైన్‌మెన్‌గా మేకల రవి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సురేశ్ బదిలీ కాగా, గునిపర్తిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రవిని ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా రవిని పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

అనాథలకు చేయూతనివ్వాలి



హసన్‌పర్తి: అనాథ వృద్ధులకు చేయూతనివ్వాలని ఉత్తమ సేవా అవార్డు గ్రహీత డాక్టర్ నరేశ్ అన్నారు. భీమారంలోని లార్డ్ వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 66వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ బర్త్‌డే, మ్యారేజ్‌డే, జయంతిలను అనాథ వృద్ధుల మధ్య జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల సంపత్, వేల్పుల సాయికుమార్, నల్ల కిరణ్, శివసాయి, వరుణ్‌సందేశ్, తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు ఎగ్ కార్ట్స్ పంపిణీ



కాశిబుగ్గ: నగరంలోని చిరువ్యాపారులు, నిరుద్యోగ యువతకు జాతీయ కోడిగుడ్ల సమన్వయ సంఘం (ఎన్ఈసీసీ) వారు సోమవారం ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నివాసంలో ఎగ్ కార్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఈసీసీ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ నిరుద్యోగ యువత, చిరు వ్యాపారులకు ఉపాధి నిచ్చేందుకు ఎగ్ కార్ట్స్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ గుడ్డును తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఈసీసీ ప్రతినిధులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

తగ్గించిన కమీషన్‌పై ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



వరంగల్: ఇన్సూరెన్స్ రెగ్యులేటరి అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏఐ) ప్రీమియం ధరలు పెంచడం, ఏజెంట్ల కమీషన్ తగ్గించడం దారుణమని దీంతో ఏజెంట్లు పెద్ద మొత్తంలో నష్టపోతున్నారని ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బా రాజాశ్రీనివాస్‌రావు అన్నారు. ములుగురోడ్ సమీపంలోని ఎల్ఐసీ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో భారతీయ బీమా సంస్థ పెంచిన ప్రీమియం ధరలకు, తగ్గించిన కమీషన్‌లకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్, ముఖ్య నాయకులు రాజిరెడ్డి, రవీందర్‌రావు, యాకయ్య, కుమారస్వామి, శ్రీను, తిరుపతి, సురేందర్, కోటేశ్వరరావు, రమేష్, భిక్షపతి, రవిబాబు, శ్రావణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైం పై అవగాహన

మడికొండ: మడికొండలోని ఎంఎస్ఆర్ నగర్‌లో మడికొండ ఎస్‌హెచ్ఓ కిషన్ ఆదేశాల మేరకు సోమవారం ఎంఎస్ఆర్ నగర్‌లోని కాలనీవాసులకు సైబర్ క్రైం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలనుద్దేశించి ఏఎస్ఐ చంద్రమౌళి మాట్లాడుతూ చదువుకునే పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. అలాగే పిల్లలకు సెల్‌ఫోన్ ఇవ్వకూడదన్నారు. సైబర్ క్రైంలకు దూరంగా ఉండాలన్నారు. కూలీ పనులు చేసే వారు ప్రభుత్వానికి సంబంధించిన వస్తువులు, ఇతర ఇళ్లలోని వస్తువులను తీసుకోకూడదని తీసుకున్న యెడల ప్రభుత్వ పరంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడి పిల్లలకు ప్రభుత్వం సకల సౌకర్యాలను కల్పిస్తుందని వారిని బడిలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బొడ్రాయి వార్షికోత్సవం

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు రుద్రమాంబనగర్‌లో మంగళ, బుధవారం గ్రామదేవత బొడ్రాయి వార్షికోత్సవం పూజలు వైభవంగా జరగనున్నాయని కమిటీ ప్రతినిధులు ఎనుకంటి రాజు, అచ్చ వినోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజల్లో పాల్గొనాలని వారు కోరారు.

మా సమస్యలు ఎవరికీ పట్టవా?

- సమస్యలకు నిలయంగా వెంకటేశ్వరకాలనీ
- డ్రెయినేజీలు అధ్వానం
- బురదమయంగా అంతర్గత రోడ్లు



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు



కాలనీకి వెళ్లే మట్టి రోడ్డు

ఖిలా వరంగల్ : ఓ సారూ మా సమస్యలు ఎవరికీ పట్టవా..? ఇంకెన్నాళ్లు తాము బురద రోడ్లపై నడవాలి..ఎటూ చూసినా మట్టిరోడ్లు దర్శనమిస్తున్నాయి. చిన్న వర్షానికే జలమయం అవుతున్నా మట్టిరోడ్లతో పాటు మురికి కూపం నుంచి విముక్తి కల్పించాలని కలెక్టర్, కమిషనర్‌కు పలుమార్లు గ్రీవెన్ సెల్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మేము ఇంటి పన్నులు కట్టలేదా..? అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీలు వేస్తున్నారు. మేమేం పాపం చేశామని వరంగల్ 43వ డివిజన్ సత్యసాయినగర్‌లోని వెంకటేశ్వరకాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో పదేళ్ల క్రితం విలీనమైన రహదారులు అధ్వాన్నంగా దర్శనమిస్తాయి. ఈ కాలనీలో సుమారు వెయ్యికి పైగా జనాభా ఉన్నారు. ఇక్కడ రోడ్లు, డ్రెయినేజీలు, లేవు. వర్షం పడితే డ్రెయినేజీలు లేక మట్టిరోడ్డుపైనే వరదలా ప్రవహిస్తోంది. ఈ కాలనీలో అక్కడక్కడా ఇళ్ల మధ్యనే మురుగుగుంటలు ఉన్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు విషజ్వరాల బారిన పడి ప్రైవేట్ వైద్యశాలలకు వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రాగానే ఎన్నో ఆశలు పెట్టుకున్నామని, కార్పొరేటర్ పాలన చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్నా ఎక్కడి సమస్య అక్కడే కనిపిస్తుందని వాపోతున్నారు. పలు సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. ఇంత వరకు ఏ అధికారి కూడా మా కాలనీని సందర్శించలేదు. సమస్య ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మా కాలనీ అభివృద్ధి చేయాలని కలెక్టర్, కమిషనర్ కార్యాలయం చుట్టు కాళ్లరిగేలా తిరిగాం. పలుమార్లు గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేశాం. కానీ ఎలాటి ఫలితం లేదు. ఇక తాము ఎవరికి చెప్పుకోవాలి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు పరిష్కరించాలి.

– శ్రీనివాస్ గుప్తా, వెంకటేశ్వరకాలనీ

వైభవంగా అమ్మవారి ఊరేగింపు



కాజీపేట : దుర్గామాతను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



కాశిబుగ్గ : ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న మహిళలు

కాజీపేట: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి కాజీపేటలో దుర్గామాత అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో భక్తులు ఊరేగించారు. శ్రీభ్రమరాంభిక మల్లికార్జునస్వామి దేవాలయం ఆవరణలో శివ–శక్తి యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఆలయ ప్రధాన అర్చకులు ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువతీ, యువకుల నృత్యాలు, తీ న్మార్ డప్పు వాయిద్యాలు, పిల్లల కేరింతల నడుమ అమ్మవారి ప్రతిమలను ఊరేగించి బంధం చెరువులో నిమజ్జనం చేశారు. యూత్ అసోసియేషన్ సభ్యులు మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు రవీందర్,శ్రీధర్,బి.రంజిత్‌కుమార్, లక్ష్మణ్ కొల్హారియా, దీపక్ కొల్హారియా, బిల్ల సతీష్, గణేష్‌సింగ్, విజయ్ పాల్గొన్నారు.

కాశిబుగ్గ : వరంగల్ నర్సంపేట ప్రధాన రహదారి దయానందకాలనీ సమీపంలోని శ్రీ కనకదుర్గామాత దేవాలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. తొమ్మిది రోజులు పూజలందుకున్న అమ్మవారిని డప్పుచప్పుళ్లు, భక్తుల కోలాటాలు, నృత్యాలతో ప్రత్యేక వాహనంపై ఊరేగించి సోమవారం తెల్లవారుజామున గొర్రెకుంట కట్టమల్లన్న చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్, సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వేరియా సురేష్‌కుమార్, కొప్పుల సరోజన, కొంక వెంకటేశ్వర్లు, పప్పు వేణు, ప్రభాకర్, శారద పాల్గొన్నారు.

విగ్రహ ధ్వంసం ప్రజాపాలనపై దాడిగా భావిస్తున్నాం



పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీసీ సంఘాల నాయకులు

- మహనీయుల విగ్రహాల పరిరక్షణకు ఆర్డినెన్స్
- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్

దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటలోని జ్యోతిరావుపూలే విగ్రహ విధ్వంసం ప్రజాపాలనపై దాడిగా భావిస్తున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. సోమవారం దేశాయిపేటలో పూలే విగ్రహం ధ్వంసం చేయడాన్ని బీసీ, ప్రజాసంఘాలతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో మహనీయుల విగ్రహాల విధ్వంసం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. గతంలో ఉర్సు ప్రాంతంలో విగ్రహ ధ్వంసానికి పాల్పడగా ఈ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు నిర్వహించామన్నారు. ధ్వంసమైన విగ్రహ స్థానంలో పోలీసులు కొత్త విగ్రహాన్ని పునఃనిర్మించగా జ్యోతిబాపూలే విగ్రహానికి దాసు సురేశ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయకుండా అర్డినెన్స్ తీసుకువచ్చి జిల్లాల వారిగా పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంజాల రాజేందర్, కందగట్ల స్వామి, మాజీ కూడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, వరంగల్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీసీ నాయకులు కుసుమ సతీష్, ఆడెపు రవీందర్, వడ్నాల నరేందర్, బుట్టి శ్యామ్ యాదవ్, యుగేందర్‌యాదవ్, వడ్డెమనుకోట తిరుపతి, వీరేందర్‌గౌడ్, కొండ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

వరంగల్: రాష్ట్రంలోని విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ల విడుదలపై గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత మూడేళ్లుగా వేల కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో డిగ్రీ, పీజీ విద్యార్థులు చదువులు పూర్తయినా సర్టిఫికెట్లు తీసుకోవడంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు లెక్చరర్లకు జీతాలు ఇవ్వలేక, అద్దె భవనాలకు కిరాయిలు కట్టలేక తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆయా యూనివర్సిటీల పరిధిలో ఉన్నటు వంటి డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్‌కు పిలుపు ఇచ్చినందున విద్యార్థులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని కోరారు.

ఆర్ట్స్ కళాశాలలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు నివాళి



కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వాణిజ్య శాస్త్రం విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సురేశ్ మృతికి సంతాప సూచకంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సురేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురేశ్ క్రమశిక్షణ కలిగిన అధ్యాపకుడని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. రెండు నిమిషాలు అధ్యాపకులంతా మౌనం పాటించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన రైల్వే జేఏసీ నాయకులు

- కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ అప్‌గ్రేడ్‌పై, రైల్వే డివిజన్ ప్రస్తావన



కాజీపేట రూరల్ : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన రైల్వే జేఏసీ బృందం



కాజీపేట అర్బన్ : కిషన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న టీఎన్జీఓస్ నాయకులు



ఖిలావరంగల్: రవికుమార్ ఇంట్లో భోజనం చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాజీపేట రూరల్ : కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ నాయకుల బృందం హనుమకొండ బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం రాత్రి కేంద్ర గనులశాఖమంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు మాట్లాడుతూ కాజీపేట రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్‌ను వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించడమే కాకుండా ఇప్పుడు కొత్తగా కాజీపేట వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తో పాటు నాలుగు దశాబ్దాల కలగా ఉన్న తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తూ కేంద్రప్రభుత్వ తీసుకున్న నిర్ణయానికి గాను ప్రధాని, రైల్వే పరిశ్రమలకు సహకరించిన కిషన్‌రెడ్డికి. జిల్లా అధ్యక్షురాలు రావు పద్మలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు తెలిపారు. మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను అలాగే కొనసాగిస్తూ కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేశాము కానీ రైల్వే మంత్రిత్వశాఖ నుంచి లెటర్ రావాల్సి ఉందని తెలిపినట్లు మంత్రి కిషన్‌రెడ్డి తమతో తెలిపినట్లు చెప్పారు. అదేవిధంగా కాజీపేటను రైల్వే డివిజన్‌గా చేయాల్సిన అవసరం ఉందని రైల్వే జేఏసీ బృందం కిషన్‌రెడ్డికి విన్నవించగా ఈ ప్రాంత ప్రజల కోసం ఒకదాని తర్వాత మరొకటి చేయడానికి కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని, మంత్రిని కలిసిన వారిలో వి.తిరుపతి, ఎ.శ్రీనివాస్, జి.భాస్కర్, ఎం.మహేష్, ఎప్నేజర్, పి.రమేష్, ఎం.కె.మూర్తి, డి.రవీందర్, కరుణాకరచారి ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కాజీపేట అర్బన్ : హనుమకొండ జిల్లా పర్యటనకు సోమవారం విచ్చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని, ఇన్‌కం ట్యాక్స్ పరిధిని ఉద్యోగులకు పెంచాలని వినతిలో పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కలిసిన వారిలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు రాజమౌళి, శ్రీనివాస్ ,రాజేష్‌ఖన్నా, హమీద్, రాజు, అనూప్, రాజీవ్, తదితరులు ఉన్నారు.

గంట రవికుమార్ ఇంటికి కేంద్ర మంత్రి

ఖిలా వరంగల్ : శివనగర్‌లోని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ స్వగృహానికి మంత్రి చేరుకున్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసి మంత్రి భోజనం చేశారు. తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, మహమ్మద్ రఫీ, ఇతర పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

సాయిబాబా మృతి సమాజానికి తీరని లోటు



కాళోజీ విగ్రహం వద్ద సాయిబాబాకు నివాళులర్పిస్తున్న దివ్యాంగ ఉపాధ్యాయుల సంఘం, రచయితల సంఘం బాధ్యులు

విద్యారణ్యపురి: ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, కవి, రచయిత, సామాజిక హక్కుల కార్యకర్త సాయిబాబా మృతి సమాజానికి తీరనిలోటు అని దివ్యాంగ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్, తెలంగాణా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండ అదాలత్ సెంటర్‌లోని కాళోజీ విగ్రహం వద్ద దివ్యాంగుల ఉపాధ్యాయుల సంఘం, తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో కవులు ,రచయితలు, దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులు సాయిబాబాబాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు, జీవితాంతం పోరాడిన మానవతావాది ప్రొఫెసర్ సాయిబాబా అని అన్నారు. 90శాతం దివ్యాంగుడైన సాయిబాబాపై ఉపాచట్టంను ప్రయోగించి పలు ఆరోపణలతో 2014 నుంచి దీర్ఘకాలంగా జైలులోనే నిర్బంధించారని చివరికి నిర్దోశిగా విడుదలయ్యాక అనారోగ్యంతో మరణించారని ఇది బాధాకరమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, అధ్యాపకుల సంఘం బాధ్యులు అస్నాల శ్రీనివాస్, వివిధ సంఘాల బాధ్యులు వాసుదేవరెడ్డి, సిహెచ్.లింగారావు, వలబోజు బ్రహ్మాచారి, గన్‌రెడ్డి యాదిరెడ్డి, పాలసాని వెంకన్న, సిహెచ్.రాజయ్య, పిట్ట సాంబయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఓ మహిళ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ కొత్తవాడకు చెందిన ఎండీ అబ్జల్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12న సాయంత్రం శివనగర్ ఏసీ రెడ్డినగర్‌లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యాడు. రాత్రి 9 గంటలకు అబ్జల్ తన తల్లి మున్నీ(59), మరో ముగ్గురు బంధువులను తీసుకుని కొత్తవాడలోని ఇంటికి ఆటోలో బయలుదేరారు. వెంకట్రామ జంక్షన్‌కు చేరుకోగానే గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో మున్నీ(59)కి తీవ్రగాయాలు కాగా ఆటోడ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. మున్నీ ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. అబ్జల్ ఫిర్యాదు మేరకు సోమవారం మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



బల్దియా గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ

వరంగల్ అర్బన్ : అనేక వ్యయ ప్రయాసలతో గ్రీవెన్స్‌కు వస్తున్న ప్రజల సమస్యలు పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 56 అర్జీలు రాగా వాటిని కమిషనర్ స్వీకరించారు. అర్జీల్లో టౌన్ ప్లానింగ్ 39, ఇంజనీరింగ్ విభాగం 6, హెల్త్, శానిటేషన్‌కు 5, తాగునీటి సరఫరా సెక్షన్ 4, ప్రాపర్టీ టాక్స్‌కు 2 దరఖాస్తులు ఉన్నాయి. అడిషనల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఎస్ఈ లు ప్రవీణ్, చంద్ర రాజయ్య, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజిరెడ్డి, సీహెచ్ఓ రాజేశ్, హెచ్ఓ రమేష్, డీఎఫ్ఓ శంకర్ లింగం, టీపీఆర్ఓ రాజేష్‌కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర, డిప్యూటీ కమిషనర్‌లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, టీఓ శ్రీను పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా ఉన్నాయి..

- 2019 సంవత్సరంలో భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్నాను.. ఇప్పటి వరకు పర్మిషన్ ఇవ్వలేదని 3వ డివిజన్ పైడిపల్లికి చెందిన యుగేందర్ ఫిర్యాదు చేశారు.
- ఉర్సు దర్గాలోని 18–4–13 ఇంటి నంబర్ ప్రాంతంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు అర్జీ పెట్టుకున్నారు.
- 47వ డివిజన్ రామ్‌నగర్ వీధిలో రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేశారని, బాధ్యులపై చర్య తీసుకోవాలని స్థానికులు వినతిపత్రం ఇచ్చారు.
- మడికొండ 1,631 సర్వే నంబర్‌లోని స్థలం ఆక్రమణకు గురవుతోందని, అందులో పార్కు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఎస్సీ, బీసీ కాలనీవాసులు విన్నవించారు.
- హన్మకొండ పోస్టల్ కాలనీలో 40ఫీట్ల రోడ్డు ఆక్రమణకు గురైందని చర్యలు తీసుకోవాలని వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

నరకాసుర వధకు ఏర్పాట్లు చేయాలి



కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మరుపల్లి రవి

ఖిలా వరంగల్ : ఈనెల 30న ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో నిర్వహించే నరకాసుర వధ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి కోరారు. సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నరకాసుర వధకు 50 వేల మంది హాజరవుతారని, ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో పెద్ద ఎత్తున విద్యుత్, ఆధునిక సౌండ్ సిస్టంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరగా సంబంధిత అధికారులకు తెలియపర్చి ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, ఆవునూరి రామ్మూర్తి, వనం కుమార్, దూడ కొమురెల్లి, అన్న కుమారస్వామి, తౌటం నరసింహా గౌడ్, రామ్ ఉన్నారు.

సీనియర్ జర్నలిస్ట్‌కు ఘన నివాళి



సుభాష్ (ఫైల్)

హసన్‌పర్తి : సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే (143) జిల్లా ప్రధాన కార్యదర్శి నాయకపు సుభాష్ (54) సోమవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. సోమవారం అనారోగ్యానికి గురి కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మరో ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఎనిమిదేళ్లుగా సుభాష్ టీయూడబ్ల్యూజే (143) సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. జర్నలిస్ట్ సమస్యలపై ఆయన నిరంతర పోరాటాలు చేశారు. సుభాష్ మృతి పట్ల జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సుభాష్ మృతదేహాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్, టెస్కాబ్ రాష్ట్ర చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఏసీపీ జితేందర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీయూడబ్ల్యూజే (143), టీయూడబ్ల్యూజే (ఎఫ్) సంఘాల ప్రతినిధులతో పాటు పాటు వివిధపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. సోమవారం రాత్రి భీమారంలోని శ్మశాన వాటికలో సుభాష్ అంత్యక్రియలు జరిగాయి.

మంచినీరు సరఫరా చేయండి



బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కాలనీవాసులు

వరంగల్ అర్బన్ : నల్లాల్లో మురుగునీరు సరఫరా అవుతుందని, శుద్ధి చేసిన నీరు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో 29వ డివిజన్‌కు చెందిన పలువురు కాలనీవాసులు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. గత నెల రోజులుగా పాపయ్యపేట చమన్, ఓఎస్ఆర్ నగర్, రఘునాథ్ నగర్ కాలనీల్లో నల్లాల నుంచి మురుగునీరు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు బాబు, అరూరి కుమార్, శ్రీనివాస్, విజయ, రమేష్, రేణుక, వీరస్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు.